# ఉచిత విద్య ఊసు మరచిన ప్రభుత్వం
# తీరుస్తోంది కార్పొరేట్ల ధన దాహం




## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ


ప్రభుత్వ విద్య
నిధుల కేటాయింపు

# ముందుమాట

ఇప్పుడు దేశమంతా “మేక్ ఇన్ ఇండియా” హోరెత్తుతోంది. ఎక్కడెక్కడి పెట్టుబడిదార్లూ వచ్చి పెట్టుబడులు కుమ్మరించి వస్తూత్పత్తి చేస్తే చవకగా యువనిపుణుల్ని అందిస్తామని దేశదేశాలూ తిరిగి మన ప్రధానమంత్రి ఆహ్వానించి వస్తున్నాడు.

ఇక తొందరలో దేశంలో మూడవస్థానం, ఆ తర్వాత ప్రపంచంలో అగ్రస్థానం పొందే దిశగా ‘అభివృద్ధి’ తారకమంత్రంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్య మంత్రి వారానికో దేశం తిరిగి చెబుతున్నాడు. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచాన్ని శాసించిన తెలుగు యువకులు రాష్ట్రాన్ని 'Knowledge Hub'గా మార్చబోతున్నారని ఊరిస్తున్నాడు.

ఇద్దరిదీ యువతపై దృష్టి. వారి నైపుణ్యాలపై దృష్టి. వారి సామర్థ్యాలపై దృష్టి. ఈ యువతే మన అభివృద్ధికంతా మూలం.

ఇదంతా ఒప్పుకొంటే మరి వారి ఎదుగుదల అంతా విద్య మీదనే గదా ఆధారపడి వుంటుంది. మరి ఆ రంగాన్ని పాలకులెలా చూస్తున్నారు? అందులో మనమెక్కడ వున్నాం?

విద్యారంగం దగ్గరికొచ్చేప్పటికి అది ప్రాథమిక విద్యగావచ్చు, విశ్వ విద్యాలయ విద్యగా వచ్చు ఆంధ్రప్రదేశ్ అంధఃపాతాళంలో వుంది. పాఠశాల విద్యల్లో మనది అక్షరాలా 33వ స్థానం! ప్రైవేట్‌రంగంలో ఎక్కువమంది పిల్లలు చదివే రాష్ట్రాల్లో మనది మొదటి స్థానం. ఒక లెక్కన మన ప్రజలు తమ పిల్లల పాఠశాల విద్య కోసం ఏడాదికి రూ. 9000కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇంటర్మీడియేట్ విద్య సర్వం కార్పొరేట్ హస్తగతమై, రెండే రెండు సంస్థల చేతుల్లో 70% పిల్లలు చదవడం ప్రపంచంలో ఎక్కడాలేని వికారం. మన ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీలు పుచ్చుకొన్న యువకుల్లో కేవలం 13% మందికి మాత్రమే చదువుకుతగ్గ ఉద్యోగాలు వస్తున్నాయి. ఇలాంటివి మన రాష్ట్రంలోనే సాధ్యం!

## ఇదంతా ఎక్కడికి దారి తీస్తోంది.?

ఇది ప్రజలకు పెనుభారంగా మారింది. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రజలందరినీ మహా సుడిగుండంలోకి తోసింది. ఇప్పుడు మన రాష్ట్రంలో ప్రతి తండ్రికీ, తల్లికీ పిల్లల చదువే పెద్ద భారం. పెద్ద సమస్య. ఎక్కడికెళ్తున్నామో తెలియని పెద్ద విషాదం.

పోనీ దీనివల్ల మన పిల్లలు శక్తివంతంగా రాణిస్తున్నారా! సర్వతోముఖంగా వికసిస్తున్నారా? అసలీ కార్పొరేట్ సంస్థలు చెబుతున్న చదువు లేమిటి? వీళ్ళ విద్యాలయాల్లో కనీసం మానసిక వికాసానికి ఆడుకొనే చోటయినా వుందా? భాషమీద శ్రద్ధ వుందా? రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌ను వాళ్ళేమయినా పాటిస్తారా? విద్యార్థుల హక్కుల మాట ఏమిటి? తల్లిదండ్రులపట్ల ఏమైనా జవాబుదారీతనం వుందా? అక్కడ చెబుతున్నవి పాఠాలేనా? ముక్కున కంఠతా పెట్టి పరీక్షలకు సిద్ధం చెయ్యడం తప్ప ఇక్కడ జరుగుతున్నదేమిటి? ఎందరికి ర్యాంకులు వస్తున్నాయి? దీన్ని ప్రశ్నించేవారెవరూ లేరా?. కనీసం ఆలోచించేవారూ కరువవుతున్నారా?. క్రమంగా ఇదొక తప్పనిసరి గుదిబండ సంస్కృతిగా మారిపోయింది.

ఇప్పుడు తొండముదిరి ఊసరవెల్లి అయ్యింది. కార్పొరేట్ విద్యా సంస్థల అధిపతులు రాజ్యాల్ని ఏలుతున్నారు. శాసనాల్ని చేస్తున్నారు. లోకానికీ, విద్యార్థులకీ తామే మోడల్స్‌మని బోర విరుచుకొని చెబుతున్నారు. అధికారికంగా విద్యారంగాన్ని తమ గుప్పిట్లోకి తెచ్చేసు కొన్నారు. దీంతో తీవ్రమైన అసమానతలు చిన్నప్పటినుంచే స్థిరపడిపోతున్నాయి. ప్రపంచ మంతా విద్య ఒక సమానత్వానికి పునాది వేసింది. ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చింది. ప్రశ్నించడాన్ని నేర్పింది. దీనికి భిన్నంగా మన రాష్ట్రంలో విద్య విద్యార్థి దశలోనే మనల్ని నిట్టనిలువునా చీల్చింది. బలహీన వర్గాలకి మంచి చదువును గగన కుసుమం చేసింది. డబ్బున్న వాళ్ళు ఏ చదువైనా చదువుకోగలరు. ఇక ఎప్పటికీ మన అధోజగత్ సహోదరులు పైమెట్టు ఎక్కలేరు. ఎక్కినా నిలదొక్కుకొని నిలబడలేరు.

దీనికీ మన ప్రభుత్వ విద్యారంగ దుస్థితికీ అవినాభావ సంబంధం వుంది. పని గట్టుకొని ప్రభుత్వమే ఈ రంగాన్ని ధ్వంసం చేస్తోంది. రోజూ ఏదో ఒక సాకుతో నిందించడం, బడ్జెట్ తగ్గించి నిర్వీర్యం చేయడం, పోస్టుల్ని నింపకుండా కాంట్రాక్టు

అధ్యాపకులతో కాలక్షేపం చేయించడం, అవినీతిమయం చేసి పాలనని భ్రష్టుపట్టించడం ఊరకే అమాయకంగా జరుగుతున్నదా? నిజానికి మనమంతా చదువుకొన్నది ప్రభుత్వ పాఠశాలల్లో గాదా? మహా మేధావుల్ని, పండితుల్ని, శాస్త్రవేత్తల్ని తయారుచేసింది ప్రభుత్వం, ఎయిడెడ్ కళాశాలలు కాదా? అంతర్జాతీయ ఆర్థిక వేత్తలు మన ఆంధ్రా యూనివర్శిటీ నుంచి రాలేదా? అంతెందుకు ఇప్పటికీ కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రభుత్వరంగమే 70-80 శాతం విద్యనన్ని స్థాయిల్లో అందిస్తోందే!! మనకేమైంది.?

దురదృష్టవశాత్తు ఒకనాడు మన రాష్ట్రం ప్రపంచబ్యాంకుకి ప్రయోగశాల. ఆ వారసత్వం లక్షణంగా నేటికీ కొనసాగుతోంది. దీనికీ ప్రభుత్వరంగానికీ సరిపడదు. మంచి విద్య, మంచి మానవులు, మంచి విలువలు వ్యాపార ప్రపంచాలకు ఏ మాత్రం ఉపయోగ పడవు. వాళ్ళకి నిరుపేదలు కావాలి. వాళ్ళు కారుచవకగా పని చెయ్యాలి.

కార్పొరేట్ చదువులు లేకుంటే కోటీశ్వరుల పిల్లలు డాక్టర్లు ఎలా అవుతారు? ఇంజనీర్లు ఎలా అవుతారు! విదేశాలకెలా వెళ్తారు? ప్రజలందరూ చదువుకొంటే, ఆ చదువు ప్రశ్నించడం నేర్పితే మన పాలక ప్రభువులు వెర్రి వేషాలు ఎలా వెయ్యగలరు? జనాన్ని ఎలా దగా చెయ్యగలరు?

అందువల్ల ఇదంతా రాజకీయం. అమాయకంగానో, పొరపాటునో, ఏ ఒక్క పార్టీనో, నాయకుడో, అధికారో చేస్తున్నది గాదు. పథకం ప్రకారమే ఇదంతా నడుస్తోంది.

ఇప్పుడు కావలసింది మంచి చదువుకోసం, అందరికీ చదువు కోసం బలమైన ప్రభుత్వ విద్యావ్యవస్థ. దాని బాధ్యత ప్రభుత్వానిది. దీన్ని సాధించుకోవడం ప్రజల హక్కు.

ఈ హక్కు సార్వజనీనం కావాలంటే విద్య చుట్టూ ఓ విస్తృత సామాజిక సంఘటన అవసరం. ఇందులో గ్రామంలోని దళితవాడల తల్లిదండ్రుల నుంచి విద్యారంగ మేధావుల దాకా అందరూ ఒక తాటిమీదికిరావాలి. సమానత్వం, లౌకికత్వం, ప్రజాస్వామ్యం ఇవి విద్యారంగ ప్రాథమిక విలువలు. వీటి కోసం తపించే ప్రతి ఒక్కరూ చేతులు కలపాలి. "అందరికీ విద్య" కోసం ఉద్యమిద్దాం. రండి!!

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

**ఆంధ్రప్రదేశ్**

# ప్రజలకు దూరమవుతున్న ప్రభుత్వ విద్య
# భారమవుతున్న కార్పొరేట్ విద్య

కేంద్రప్రభుత్వ మానవ వనరుల శాఖ ప్రాథమిక విద్యారంగంలో రాష్ట్రాల స్థితి గతులపై ఇటీవలే ఒక నివేదిక ప్రచురించింది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి రాష్ట్రం) ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల నమోదులో 25వ స్థానంలో, ప్రాథమికోన్నత స్థాయి నమోదులో 33వ స్థానంలో వుండగా 15-24 మధ్య వయస్కుల అక్షరాస్యతలో 23వ స్థానంలో ఉంది! ఇక జాతీయ అక్షరాస్యత శాతం 74కాగా, మన (13 జిల్లాల) ఆంధ్రప్రదేశ్ 67.02 శాతం మాత్రమే!

ఈశాన్య రాష్ట్రాలతో పోల్చినా మనం ఎందుకింత వెనకబడి వున్నాం? దీనికి ప్రధాన కారణం ప్రాథమిక విద్య పట్ల మన పాలకుల నిర్లక్ష్యం. పై గణాంకాలే దీనికి నిదర్శనం. సర్వశిక్షాభియాన్ నిధులు గత 14 ఏళ్ళలో (2013-14 నాటికి) 14వేల కోట్లు వచ్చినా మనం సంపూర్ణాక్షరాస్యతకు ఎంతో దూరంలో వున్నాం.

**ప్రాథమిక పాఠశాలలు - ప్రస్తుత పరిస్థితి :** మన రాష్ట్రంలో 34501 ప్రభుత్వ, 1572 ఎయిడెడ్, 3736 ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో 28 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. అత్యంత దయనీయంగా, పతనపుటంచుల్లో వున్న రంగం ప్రాథమిక విద్యారంగం.

తల్లిదండ్రుల నుంచి పిల్లలకు మంచి చదువుకోసం తీవ్రమైన ఆకాంక్ష వ్యక్తమవుతున్న రాష్ట్రాల్లో మన రాష్ట్రం ఒకటి. నిజానికిది మంచి పరిణామం. దీన్ని గమనంలోకి తీసుకొని మంచి పాఠశాలలు ప్రభుత్వ రంగంలో నడపడం ప్రభుత్వ బాధ్యత.

వాస్తవానికి సంఖ్యాపరంగా చూస్తే మన పాఠశాలలు తక్కువేమీగాదు. విద్యాహక్కు చట్టం ప్రకారం చూసినా 1 కి.మీ. లోపు 99% గ్రామాలకు, ఆవాసాలకు స్కూళ్ళు

అందుబాటులో వున్నాయి.

1990 ప్రాంతంలో డి.పి.ఇ.పి. ప్రపంచ బ్యాంక్ సహకారంతో 'ప్రైమరీ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' అనే డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. రెండంశాలను వ్యూహాత్మకంగా ముందుకు తెచ్చింది.

☛ ప్రజల్లో పిల్లల చదువుల పట్ల స్పృహ పెంచాలి.

☛ ఈ స్పృహ, రుచి పెరిగే కొద్దీ తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ఎక్కువ ఖర్చు పెడతారు. తపనపడతారు.

దీనికనుగుణంగా మన రాష్ట్రంలో పెద్దఎత్తున అక్షరాస్యత ఉద్యమాలు నడిచాయి. విద్యపట్ల ఇవి స్పృహను పెంచాయి. ఇబ్బడిముబ్బడిగా పాఠశాలలు వెలిశాయి. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోకి స్కూళ్ళు వచ్చాయి. కానీ ఈ స్పృహ పెరిగితే దీనికనుగుణమైన మంచిస్కూళ్ళు నడపాలని, దీనికి తగ్గ ప్రణాళిక, నిధులు అవసరమని ప్రపంచ బ్యాంక్ చెప్పలేదు. స్పృహ పెంచితే ఇక ప్రజలే పిల్లల చదువుల సంగతి చూసుకొంటారనేది దాని తర్కం. దేశంలో ఎక్కడా లేనట్టు ఇది మన రాష్ట్రంలో అమలు అయింది.

ఫలితంగా మన పాఠశాలలు ప్రజల స్పృహకు ఏమాత్రం సరితూగలేనివి వేలాది వెలిశాయి. పిల్లలు వీటికి దూరమయ్యారు. ఇప్పుడు ఈ పాఠశాలలు మూతబడుతున్నాయి. పిల్లలు ప్రైవేటు స్కూళ్ళకు వెళుతున్నారు.

మంచి స్కూళ్ళు నడిపితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. దీనికి ప్రభుత్వం సిద్ధంగాలేదు. పనికిరాని బడిపెట్టి, జనం రాలేదని నెపం బెట్టి, మూసేయడం దాని లక్ష్యం.

కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు బలమైన ప్రాథమిక పాఠశాల వ్యవస్థను కేంద్ర ప్రాజెక్టుల సహకారంతో ఏర్పాటు చేసుకొన్నాయి. ఏ పాఠశాల చూసినా 5-6 గదులు, 6-7 మంది టీచర్లతో అన్ని హంగులతో అక్కడ నడుస్తున్నాయి.

ఇప్పుడు మన ప్రాథమిక పాఠశాలలు మూతకు సిద్ధంగా, శిథిల దేవాలయాల్లా మారాయి. మరో 10 ఏళ్ళలో ఇవి నామమాత్రంగా మిగలడం ఖాయం. ఇవి బాగుపడకుండా ప్రభుత్వ విద్య బతకడం అసంభవం.

**అసమానతలు, నాసిరకం చదువు, పాఠశాలల మూత, ప్రజలపై తీవ్రమైన భారం, విచ్చల విడిగా ప్రైవేటు పాఠశాలల విస్తరణ, దోపిడీ, ప్రాథమిక విద్యారంగం సారంగా**

చెప్పుకోవచ్చు.

**పేదలపై పెను భారం :** రాష్ట్రంలో పాఠశాల విద్య దాదాపు 50 శాతం ప్రైవేటు పరం అయింది. ప్రైవేటు పాఠశాలలు మారుమూల గ్రామాలకు కూడా విస్తరించాయి. ప్రభుత్వ పాఠశాలల్ని వదిలి పిల్లలు ప్రైవేటు స్కూళ్ళకు వెళుతున్నారు. ప్రతి ఏటా సుమారు 1.5 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్ని విడిచి పెడుతున్నారు.

ఫలితంగా మధ్య తరగతి వర్గంతో సహా అన్ని వర్గాల వారు తమ ఆదాయంలో ఎక్కువ భాగం పిల్లల చదువులకే వెచ్చించాల్సివస్తోంది. గ్రామాల్ని వదిలి పట్టణాలకు పిల్లల చదువులకోసమే రావల్సి వస్తోంది. గ్రామీణ వ్యవసాయ రంగం కుదేలవడంతో, పట్టణ పేదరికం పెరగడంతో, అరకొర జీతాల ఉద్యోగాలు మాత్రమే దక్కుతుండడంతో పిల్లల చదువులు మొయ్యలేని భారంగా మారాయి.

దీనిపై లోతైన అధ్యయనం జరగాల్సివుంది. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూడవల్సివుంది. మంచి విద్యను ప్రభుత్వం అందిస్తేనే ఈ విపత్తు నుంచి జనం బయటపడతారు. దీనికోసం పెద్ద ఉద్యమమే జరగాలి.

**ప్రైవేటు స్కూళ్ళు తెచ్చిన ప్రమాదాలు:** ప్రైవేటు స్కూళ్ళు విద్యను వ్యాపారమయం చేశాయి. ఉపాధ్యాయుడు, విద్యార్థి, చదువు అన్నీ వ్యాపార వస్తువులుగా మారారు. దీంతోపాటు తీవ్రమైన అసమానతల్ని ఇవి తెచ్చాయి. ప్రపంచమంతా స్కూలు విద్యలో అసమానతల్ని తగ్గిస్తే మన ప్రైవేటు స్కూళ్ళు విద్య ద్వారా అసమానతలు తీవ్రంగా పెంచాయి.

అదే సందర్భంగా ప్రైవేటు స్కూళ్ళు విద్యను కృతకంగా మార్చాయి. భట్టీపట్టడం, పరీక్షలకు సిద్ధంగావడం విద్యగా మార్చాయి. విలువలకు చెల్లుచీటీ ఇచ్చాయి. వ్యక్తిగత ధోరణిని పెంచాయి. సమాజం పట్ల ఏ బాధ్యతా లేని పిల్లల్ని తయారు చేస్తున్నాయి.

**కొన్ని ప్రయత్నాలు:** స్థానిక ప్రజలు, పెద్దలు, టీచర్లు కొన్ని గ్రామాల్లో చేసిన ప్రయత్నాలు చాలా మంచి ఫలితాలనిచ్చాయి. వీటి నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాల్సివుంది.

నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం, కాకొల్లు వారి పల్లెలో 70 శాతం పిల్లలు మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలకు వెళ్ళేవారు. మూడేళ్ళ క్రితం గ్రామంలో రిటైరయిన టీచర్లు గ్రామ ప్రజల్ని కూడగట్టి కొందరు దాతల్ని ఒప్పించి ఆ ఊరి ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు టీచర్లకు మరో నలుగురు విద్యావాలెంటీర్లను చేర్చి, ప్రీప్రైమరీ

సెక్షన్ ప్రారంభించి, ఇంగ్లీష్ మీడియం కూడా చేర్చారు. 7 క్లాసు రూములుండేలా (తాత్కాలికంగా) తీర్చిదిద్దారు. ఇప్పుడా ఊరి నుంచి దాదాపు ఏ విద్యార్థి బయటికి వెళ్ళడం లేదు. మండల కేంద్రం నుంచి ఆ ఊరి బడికి పిల్లలు వస్తున్నారు.

ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం, దైవాల రావూరు హైస్కూలు ఉపాధ్యాయులు తమ పాఠశాలలో పిల్లలు చేరడం లేదని దీనికి ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు చేరకపోవడమే కారణమని ఒక ప్రయత్నం చేశారు. గ్రామ పెద్దల్ని సంప్రదించి గ్రామంలోని 4 ప్రాథమిక పాఠశాలల్ని ఒకే స్కూల్లోకి తెచ్చి అందరు టీచర్లు అక్కడే బోధించేలా ఏర్పాటు చేశారు. ఇంగ్లీషు బోధనపై కేంద్రీకరించారు. తరగతికి ఒక గది వుండేలా తాత్కాలిక ఏర్పాటు చేశారు. రెండేళ్ళలో ఆ పాఠశాల పిల్లలు మూడు రెట్లు పెరిగారు. గ్రామానికి దగ్గరవున్న కాన్వెంట్ మూతబడింది. ఇలాంటివి చాలా చోట్ల కన్పిస్తాయి.

**ఇవి నేర్పుతున్న పాఠాలు :**

☞ మంచి బడికి మాత్రమే పిల్లలు వస్తారు.

☞ తరగతికి ఒక గది, టీచరు తప్పనిసరి.

☞ మాతృభాషలో విద్యా బోధనతోపాటు ఇంగ్లీషుకు ప్రాధాన్యత ఇవ్వాలి.

☞ పూర్వ ప్రాథమిక విద్య బడిలో వుండాలి.

☞ టీచర్లు, గ్రామస్తులు తమవూరి బడిని నిలబెట్టు కొనేందుకు ముందుకు రావాలి.

☞ ఎవరో ఒకరు ముందు నిలబడాలిగదా.

**ప్రాథమిక పాఠశాలల సమస్యలు :**

☛ మంచి ప్రాథమిక పాఠశాలలకు 5+1 టీచర్లు, 6 తరగతి గదులు 150 మంది పిల్లలు వుండాలి. ఇలాంటివి ఆంధ్రప్రదేశ్‌లో 4 శాతం మాత్రమే వున్నాయి. కేరళలో ఇలాంటివి 98%, తమిళనాడులో 82 శాతం.

☛ ఒకరిద్దరు టీచర్లతో వున్న స్కూళ్ళు ఆంధ్రప్రదేశ్‌లో 70 శాతం. ఇద్దరిలో ఒకరు సెలవు పెట్టినప్పుడు, మీటింగులకు వెళ్ళినపుడు ఇవి ఏకోపాధ్యాయ పాఠశాలలే.

☛ ఏ ప్రైవేటు ప్రాథమిక పాఠశాల చూచినా, అది ఎంత చిన్నదయినా తరగతికి ఒక టీచరున్నవే.

☛ ఈ స్కూళ్ళు సరిగా పనిచెయ్యవు. టీచర్లురారు. సామాజిక ఒత్తిడిలేదు.

☛ ఏ సర్వే ప్రకారం చూచినా వీటిలోని పిల్లల విద్యా ప్రమాణాలు పరమ నాసిరకం.

☛ తరగతి గదులు మినహా వీటిలోని వసతులు, మధ్యాహ్న భోజనం కనీస ప్రమాణాలున్నవికావు.

☛ ఎం.ఇ.వో.ల పోస్టులు భర్తీ కానందున, పాఠశాల నిర్వహణ కమిటీలు కాగితంపై వున్నందున వాటి కెలాంటి పర్యవేక్షణా లేదు.

☛ ఫలితం ఇవి 'నామ్ కే వాస్తే' గా నడుస్తున్నాయి.

☛ ప్రతి ఏటా వేల స్కూళ్ళు మూతబడుతున్నాయి.

**కారణాలు:**

☞ మంచి చదువుకోసం ప్రజల్లోవున్న ఆకాంక్షకు తగ్గట్టు మన పాఠశాలలు లేకపోవడం.

☞ ఇంగ్లీషు వ్యామోహం.

☞ ప్రైవేటు పాఠశాలలకు విచ్చలవిడిగా అనుమతులివ్వడం.

☞ పట్టణీకరణ, గ్రామాల నుంచి వలసలు.

**పరిష్కారం:** పిల్లలందరికీ పాఠశాల అందుబాటులో వుండాలి. 1 కి.మీ.లోపు బడి వుండి తీరాలి. అదే సందర్భంలో ఆ స్కూలు అన్ని హంగులతో ఆధునికంగానూ వుండాలి.

ఇంగ్లీష్ బోధనకు ప్రత్యేక ఏర్పాటు వుండాలి. అది ఇంగ్లీష్ మీడియం కావచ్చు. కాకపోవచ్చు. శక్తివంతంగా ఇంగ్లీష్ మాత్రం నేర్పాలి.

బలమైన పర్యవేక్షణా వ్యవస్థ, ప్రజల అజమాయిషీ, టీచర్లకు, అధికార్లకు జవాబు దారీతనం వున్నప్పుడే స్కూళ్ళు బాగా నడుస్తాయి.

వలసలు, గిరిజనులు, మరీ వెనకబడ్డ వారి పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు వుండాలి.

ఒక సమగ్ర ప్రణాళిక, తగినన్ని నిధులు వుంటేనే ఇదంతా జరుగుతుంది.

**ప్రాథమికోన్నత పాఠశాలలు :** రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో 5106, ఎయిడెడ్ 291, ప్రైవేటు 4182 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 13,26,000 మంది పిల్లలున్నారు. పెద్దగా నిలబడలేకపోతున్నాయి.

మన రాష్ట్రంలో ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రభుత్వం దాదాపు సగం స్కూళ్ళ నుంచి 6,7 తరగతుల్ని తగ్గించింది. మిగిలినవి కూడా అదేబాటలో వున్నాయి.

ప్రాథమిక, ప్రాథమికోన్నత (6,7,8) తరగతులకు తగినట్లు టీచర్లు, సబ్జెక్టు టీచర్లు లేక పోవడం, ఉన్నత పాఠశాలలు ఎక్కువ సందర్భాల్లో దగ్గరలో వుండడంతో ఇవి మూతపడుతున్నాయి.

6–7 తరగతుల పిల్లలకు హైస్కూల్లో ఇంగ్లీష్, హిందీ, తెలుగు, గణితం, సామాజిక శాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులకు వేర్వేరు టీచర్లు వుంటారు. కానీ యు.పి. స్కూళ్ళలో తెలుగు, గణితం, సామాజిక శాస్త్రం టీచర్లు మాత్రమే వుండి వీరే అన్ని సబ్జెక్టులు బోధిస్తారు. దీంతో ఎక్కువ మంది హైస్కూళ్ళనే ఎంచుకొంటున్నారు. యు.పి.స్కూళ్ళలో 6, 7 తరగతులు చదివిన పిల్లలు 8వ తరగతిలో హైస్కూళ్ళలో రాణించడం కనాకష్టం. అందుకే ఇవి నిరాదరణకు గురవుతున్నాయి.

**ఉన్నత పాఠశాలలు :** రాష్ట్రంలో 6056 ప్రభుత్వ, 484 ఎయిడెడ్, 4132 ప్రైవేటు ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 32 లక్షల మంది పిల్లలున్నారు.

ఉన్నంతలో ప్రభుత్వ విద్యారంగంలో కళకళలాడుతున్నవి ఉన్నత పాఠశాలలే. సగటున 300కిపైగా మన ఉన్నత పాఠశాలల్లో పిల్లలున్నారు.

2009లో పెద్దఎత్తున ప్రాథమిక పాఠశాలల్లోని పోస్టులను రద్దుచేసి ఉన్నత పాఠశాలలకు షుమారు 30 వేల పోస్టులిచ్చారు. దాదాపు అన్నిస్కూళ్ళకు హెడ్‌మాస్టరు, సబ్జెక్టు టీచర్లు దీంతో సమకూరినట్లయింది. దీంతోపాటు ఇంగ్లీష్ మీడియం సమాంతరంగా దాదాపు 4000 పాఠశాలల్లో ప్రారంభించారు. ఆర్.ఎం.ఎస్.ఎ., ఎస్.ఎస్.ఎ. నిధుల నుంచి భవనాలు కూడా ఒక మేరకు నిర్మించారు. ఫలితంగా ఉన్నత పాఠశాలలకు ఒక స్పష్టమైన వ్యవస్థ ఏర్పడింది.

ప్రాథమిక స్థాయిలో ప్రైవేటు స్కూల్లో చేర్చినా, ఉన్నత పాఠశాల ఫీజులు ఎక్కువ కావడంతో ప్రభుత్వ హైస్కూళ్ళకు పిల్లల్ని పంపడం కూడా జరుగుతోంది.

కొంచెం శ్రద్ధ పెట్టి, కాలానుగుణంగా మార్చి కొత్త హంగులు ఏర్పరిస్తే మంచి ఫలితాలు ప్రభుత్వ రంగంలో అసాధ్యమేమీ కాదని ఇవి నిరూపిస్తున్నాయి. దాదాపు 75 శాతం హైస్కూళ్ళలో పిల్లల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ విద్యను రాష్ట్రంలో కాపాడుతున్నది హైస్కూళ్ళే.

**హైస్కూల్ సమస్యలు:**

☛ హైస్కూల్‌లో వసతులు తక్కువ. వాచ్‌మన్, అటెండర్ లాంటి పోస్టులు లేవు. మరుగుదొడ్లు నామమాత్రం.

☛ పెద్ద స్కూళ్ళలో తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరు.

☛ కొత్త కొత్త వ్యవస్థలు (మోడల్ స్కూళ్ళు, కస్తూర్బా స్కూళ్ళు) రావడంతో పిల్లలు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

☛ హాస్టళ్ళ మూతతో హైస్కూళ్ళలోనూ పిల్లలు తగ్గిపోతున్నారు.

☛ ఇంగ్లీష్ మీడియం వున్నచోట దానికి తగ్గ తరగతి గదులు, టీచర్లు, సామాగ్రి లేనందువల్ల అది నాసిరకంగా వుంది.

☛ పర్యవేక్షణ దాదాపు శూన్యం. ఇన్‌ఛార్జి డిప్యూటీ డి.ఇ.వో.లు 100-150 స్కూళ్ళకు ఒకరు వంతున వుంటే కాలక్షేపం తప్ప ఏం చేయగలరు.

☛ ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్ళినపుడు ప్రత్యామ్నాయ ఏర్పాటు లేక నెలల తరబడి పిల్లలు నష్టపోతున్నారు.

☛ టీచర్లకు మూల్యాంకనం, రికార్డులు పనిభారం ఎక్కువ.

☛ ప్రభుత్వం వద్ద పక్కా ప్రణాళిక ఏమీలేదు.

**గురుకులాలు ఇతర సంస్థలు :** దేశంలో ఎక్కడా లేనన్ని గురుకుల పాఠశాలలు మన రాష్ట్రంలో వున్నాయి. ఇవి విద్యాశాఖ, సాంఘిక, గిరిజన వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటిలో పిల్లలు పుష్కలంగా చేరుతున్నారు. ఉన్నంతలో పేదపిల్లలకు ప్రామాణికమైన విద్యని అందిస్తున్నాయి. ఇదొక సమాంతర బృహత్ వ్యవస్థ. కస్తూర్బా స్కూళ్ళు తప్ప మిగిలినవి ఇంగ్లీష్ మీడియంలో నడుస్తున్నాయి. కస్తూర్బా స్కూళ్లు కూడా ఇంగ్లీష్ మీడియంలోకి మారబోతున్నాయి.

**సమస్యలు:**

☞ ఒక్కొక్క యాజమాన్యానిది ఒక్కొక్క తీరు, పెత్తనం. వీటిలో జోక్యం, మాటిమాటికీ మార్పులు తేవడంతో, ఐ.ఎ.యస్. ఆఫీసర్ల స్వీయ ధోరణులతో గురుకులాలు సతమతమవుతున్నాయి.

☞ హడావుడిగా గురుకులాలు ప్రారంభిస్తున్నారు. గానీ భవనాలు వసతులు వుండటంలేదు. హైస్కూళ్ళ కన్నా అధ్వాన్నపు సౌకర్యాలతో నడుస్తున్నాయి.

☞ ఏళ్ళ తరబడి నియామకాలులేక, పోస్టులు ఇవ్వక కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ సిబ్బందితో నడుస్తున్నాయి.

☞ నిరంకుశ అప్రజాస్వామిక యాజమాన్యాలు పెద్ద సమస్య.

☞ కస్తూర్బా స్కూళ్ళు అన్నీ కాంట్రాక్టు టీచర్లతోనే నడుస్తున్నాయి. కేంద్రం నిధులు తగ్గిస్తోంది. వీటి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది.

☞ హడావుడిగా ఎక్కడంటే అక్కడ పెట్టడంతో అప్పటికే అక్కడున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

☞ వీటికి అకడమిక్ వ్యవస్థలు లేవు. ఎప్పుడూ ప్రయోగాలతోనే సరిపెడుతున్నారు.

**మున్సిపల్ విద్య :** రాష్ట్రంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ మరియు కార్పోరేషన్లతో సహా 2124 పాఠశాలలున్నాయి. వీటిలో 11622 మంది టీచర్లున్నారు. 2,99,546 మంది విద్యార్థులున్నారు.

ఒక మేరకు ప్రభుత్వ విద్యావ్యవస్థ ఈ స్కూళ్ళ మీదనే ఆధారపడి వుంది. కానీ రాష్ట్రంలో ఏమాత్రం విస్తరణకు నోచుకోని, తాడూ బొంగరం లేని వ్యవస్థ మున్సిపల్ విద్యావ్యవస్థే.

ఓవైపు పట్టణీకరణ పెరుగుతోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతోంది. పట్టణ పేదలు పెరుగుతున్నారు. పట్టణాల్లో ప్రైవేటు, కార్పోరేట్ స్కూళ్ళు రాజ్యమేలు తున్నాయి. వీటికి పోటీగా నిలబడతగ్గ మున్సిపల్ విద్యా వ్యవస్థ మనకులేదు.

తెలంగాణలో మున్సిపల్ స్కూళ్ళులేవు. అందువల్ల ఆంధ్రలోని మున్సిపల్ స్కూళ్ళు కూడా నిరాదరణకు గురైనాయి. దీంతోపాటు ప్రైవేటు విద్య పట్టణాల్లో కేంద్రీకృతమై వుండడంతో మున్సిపల్ విద్య అనాథగా మారింది. పట్టణాల్లో మున్సిపల్ స్కూళ్ళను విస్తరించి, పటిష్ట పర్చడంపైనే విద్యారంగం భవిష్యత్తు ఆధారపడి వుంది.

ఉన్న సమస్యలకుతోడు నేడు విద్యా శాఖ నుంచి తప్పించి నేరుగా మున్సిపల్ పరిపాలనా శాఖ వీటిని స్వతంత్రంగా నిర్వహించుకొంటామని, దీనికి కార్పోరేట్ విద్యా సంస్థల సహకారం తీసుకొంటామని ప్రకటించి దానికి అనుగుణంగా పావులు కదపడంతో మున్సిపల్ విద్యా వ్యవస్థ భవిష్యత్ రూపురేఖలపై నీలినీడలు పరచుకొంటున్నాయి.

**సమస్యలు:**

☛ మున్సిపల్ శాఖకు, విద్యాశాఖకు, లింకులేనందువల్ల పోస్టులు, భవనాలు, ఇతర నిధులు మున్సిపల్ స్కూళ్ళకు ప్రభుత్వ స్కూళ్ళతో సమానంగా రావడంలేదు.

☛ టీచర్లకు ప్రత్యేక సర్వీస్ రూల్సు లేనందువల్ల కౌన్సిలర్లు, కార్పోరేటర్ల దయాదాక్షిణ్యాలపై వీరి బదిలీలు, ప్రమోషన్లు నడుస్తున్నాయి.

☛ పి.ఎఫ్., ఎల్.ఐ.సి. తదితరాలన్నిటిలోనూ ప్రభుత్వ టీచర్లకు మున్సిపల్ టీచర్లకు చాలా తేడా వుంది.

☛ పట్టణాల విస్తరణ, జనాభా విస్తరణకు తగ్గట్లు మున్సిపల్ స్కూళ్ళు పెరగలేదు.

☛ వసతులు, భవనాలు, మరుగుదొడ్లు చాలా తక్కువ

☛ కొన్ని మున్సిపల్ స్కూళ్ళలో పిల్లలు చాలా ఎక్కువ మంది వున్నారు. చాలా స్కూళ్ళు దయనీయంగా వున్నాయి.

☛ కార్పోరేట్ పెత్తనం, జోక్యం పొంచివుంది.

**రేషనలైజేషన్ క్లస్టరైజేషన్ :** పాఠశాల వ్యవస్థ అస్తవ్యస్తంగా వుండడంతో దీన్ని సమూలంగా మారుస్తామని ప్రభుత్వం మాటిమాటికీ చెబుతోంది. తెచ్చే మార్పులు మంచికోసమో ముంచడం కోసమో అర్థం కాకుండా నాటకాలు ఆడుతోంది.

స్కూళ్ళు, టీచర్లు అవసరమైనదానికన్నా ఎక్కువ వున్నా ఫలితాలు రావడం లేదని ప్రభుత్వ వాదం. వీటిని కుదించాలని ప్రభుత్వ ప్రయత్నం. ఇందులో భాగంగా మొదట క్లస్టరైజేషన్ ప్రతిపాదన తెచ్చింది. ఒక సర్వే చేయించింది. మండలంలోని అన్ని పాఠశాలల్ని 10-12 పెద్ద పాఠశాలలుగా కుదించి అన్ని హంగులతో అత్యాధునికంగా నడపడం క్లస్టరైజేషన్ ఉద్దేశం. రాష్ట్రంలో మొదట సుమారు 4000 ఇలాంటి క్లస్టర్ స్కూళ్ళు ప్రారంభించాలని, ఒక్కోదానికి 1.70 కోట్లు వ్యయం అవుతుందని సుమారు 6000 కోట్లు బడ్జెట్ అదనంగా కావాలని విద్యాశాఖ ప్రతిపాదించింది.

కానీ ఇది ఆచరణ సాధ్యం కాదని అంతపెద్ద ఎత్తున నిధులు కూడా లభ్యం కావని ప్రభుత్వం గుర్తించింది. పెద్దఎత్తున వ్యతిరేకత కూడా రావచ్చునని భావించి ఇప్పుడు వెనకడుగు వేసింది. ప్రస్తుతానికి దీన్ని విరమించుకొంది లేదా వాయిదా వేసింది.

ప్రస్తుతం రేషనజైలేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇది ఈ మధ్య ప్రతి ఏడాదీ జరుగుతున్నదే. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు తగ్గడం 10 లోపు పిల్లలున్నవిగా

మారడంతో ఇలాంటివి మూసివేయడం గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతోంది. సుమారు 5000 పాఠశాలలు ఇప్పటికే మూతబడ్డాయి. కొన్నిటిని మూయకపోయినప్పటికీ టీచర్లను మరోచోటికి బదిలీ చెయ్యడంతో వాలెంటీర్లతో నడుస్తున్నాయి.

ఇప్పుడు మళ్ళీ రేషనలైజేషన్ ప్రక్రియ మొదలైంది. ఒక కిలోమీటర్‌లోపున మరో స్కూలు వుండి 30 లోపు పిల్లలు వున్న ప్రాథమిక పాఠశాలలను, 3 కిలోమీటర్లలోపున మరో స్కూలు వుండి 35 మంది 6-7 తరగతుల పిల్లలున్న ప్రాథమికోన్నత పాఠశాలలను, 5 కిలోమీటర్లలోపున మరో ఉన్నత పాఠశాల వుండి 75 లోపు పిల్లలున్న హైస్కూళ్ళను సమీప స్కూళ్ళలో విలీనం చేయాలనేది ప్రస్తుత ప్రతిపాదన. ప్రత్యేక సందర్భాల్లో మినహాయింపులిచ్చి ఇలా విలీనం చేస్తే 6000-7000 పాఠశాలలు ఈ విలీనానికి (మూతకు) గురవుతాయి.

పంచాయితీకి ఒక కామన్ స్కూలు అన్ని హంగులతో ఏర్పరుస్తామని, 6 మంది టీచర్లు 5 తరగతి గదులు, ఇంగ్లీష్ టీచరు, బాల్యారంబ కేంద్రం వుండేలా మొదట ఏర్పర్చాలని తర్వాత అవసరమైనన్ని ఇలాంటివి ఏర్పర్చాలని మనం చిరకాలంగా కోరుతున్నాము. కేరళ, తమిళనాడుల్లో ఇలాంటి స్కూళ్ళ వల్లనే ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిలదొక్కుకొందనే వాస్తవాన్ని మన రాష్ట్ర పాలకులు విస్మరిస్తున్నారు.

ఇప్పుడు ప్రభుత్వం ఇలాంటి స్కూళ్ళు పెట్టాలంటే చిన్న చిన్న స్కూళ్ళు మూత వెయ్యాలంటోంది. దీన్ని మనం వ్యతిరేకించాలి.

**హాస్టళ్ళు - గురుకులాలు :** రాష్ట్రంలోని హాస్టళ్ళు చాలా చరిత్రగలవి. ఏ రాష్ట్రంలోనూ లేనన్ని హాస్టళ్ళు మనకున్నాయి. వీటిలోని వసతులు పరమ అధ్వానంగా వుండడంతో పిల్లలు తగ్గి పోతున్నారు. ఈ సాకుతో ప్రభుత్వం వీటిని మూసివేయాలని ఓ ప్రణాళిక రూపొందించింది. వీటన్నిటిని గురుకులాలుగా మారుస్తామని చెపుతోంది. తొలిదశలో జిల్లాకు దాదాపు 50కి పైగా హాస్టళ్ళు మూతబడుతున్నాయి. వీటిలోని పిల్లల్ని ఎంపిక చేసిన ప్రస్తుత గురుకులాల్లో చేర్చడానికి సన్నాహాలు చేస్తున్నారు. కొత్తగా 77 గురుకులాలు ప్రారంభిస్తే అన్ని హాస్టళ్ళ పిల్లలు వీటిలోకి సర్దవచ్చునని ఒక ప్రణాళిక కూడా సిద్ధం చేశారు. ఇది చాలా మందిని భ్రమల్లో పెడుతోంది.

**ఎదరయ్యే సమస్యలు:**

☞ ప్రస్తుత హాస్టళ్ళు అందుబాటులో ఉన్నాయి. వీటిలో వున్న పిల్లలు చాలా ఎక్కువ. వీళ్ళని దూరంగా వున్న గురుకులాల్లో చేర్చితే సగం మంది సిద్ధపడరు.

☞ హాస్టళ్ళలోని పిల్లల సంఖ్యతో పోల్చితే 77 గురుకులాలు పెట్టినా వీటిలో చేరగల పిల్లల సంఖ్య 3వ వంతు కూడా వుండదు. ఫలితంగా వేల మంది నష్టపోతారు.

☞ చాలా హైస్కూళ్ళకు అనుబంధంగా ప్రస్తుత హాస్టళ్ళు వున్నాయి. హాస్టళ్ళ వల్లనే వీటిలో ఎక్కువ మంది పిల్లలున్నారు. హాస్టళ్ళను మూసివేస్తే వందలాది జిల్లా పరిషత్ స్కూళ్ళు వెలవెల పోతాయి. టీచర్ల భవనాలు మిగిలి పోతాయి.

**ఈ రంగంలో ఇప్పుడు జరగాల్సినవి :**

1. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం ఈ 5 సంవత్సరాలకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటిని ఎలా సాధించాలనుకున్నది, కేటాయించే బడ్జెట్ గురించి స్పష్టపరచాలి.
2. మంత్రివర్యులు అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహించాలి.
3. గిరిజనుల, పల్లెకారుల ఇతర వెనుకబడిన తరగతులలో సంపూర్ణ అక్షరాస్యతకు అవసరమైన ఫండ్ కేటాయించాలి.
4. పర్యవేక్షణా యంత్రాంగాన్ని బలపరచి క్రమశిక్షణను పెంపొందించాలి.
5. పిల్లల తల్లిదండ్రులను స్కూల్ నిర్వహణలో భాగస్వాములు చేయాలి.
6. పిల్లలకు టూర్స్, ప్రాజెక్టుకు ఫండ్ కేటాయించాలి.

| టీచర్ల పిల్లల నిష్పత్తి | | | |
|---|---|---|---|
| **ప్రభుత్వ** | | **ఎయిడెడ్** | **ప్రైవేటు** |
| **ప్రాథమిక** | **1:23** | **1:34** | **1:37** |
| **ప్రాథమికోన్నత** | **1:21** | **1:32** | **1:21** |
| **ఉన్నత** | **1:25** | **1:37** | **1:27** |

| డ్రాపౌట్స్ శాతం | | | |
|---|---|---|---|
| **ప్రాథమిక** | | **ప్రాథమికోన్నత** | **ఉన్నత** |
| **ఎస్.సి** | **5.98** | **24.79** | **34.98** |
| **ఎస్.సి** | **19.24** | **18.95** | **60.37** |
| **జనరల్** | **3.25** | **18.95** | **27.48** |

# కార్పొరేటు విద్యావ్యవస్థ - ప్రజల నియంత్రణ

రాష్ట్రంలో మొత్తం స్కూలు విద్యార్థులలో 50% పైగా ప్రైవేట్ స్కూల్స్‌లో చదువుతున్నారు. ఈ ప్రైవేటు, కార్పొరేటు రంగంపై ప్రభుత్వ మరియు ప్రజల పర్యవేక్షణ నామమాత్రంగానే వుంది. కార్పొరేటు మీడియా ద్వారా కార్పొరేటు స్కూల్స్ కాలేజీలలో చదివించకపోతే పిల్లలకు భవిష్యత్తు లేకుండా పోతుందనే భయంకరమైన తప్పుడు ప్రచారం జరుగుతున్నది. ఈ ప్రచార ప్రభావం తల్లిదండ్రులపై, పిల్లలపై ఎక్కువగా వుంటున్నది. చట్టపరంగా ఈ సంస్థలను నియంత్రించడానికి ఉన్న కొద్ది అవకాశాలను ప్రజలు కూడా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ విద్యాలయాల మెరుగు కోసం ఇప్పటిదాకా కృషి జరుగుతున్నది. ఇక నుంచి ఈ ప్రైవేటు సంస్థల దోపిడీని, పిల్లలకు కల్పించాల్సిన సౌకర్యాల కోసం ప్రజలు పోరాడాల్సివుంది.

రాజకీయాలనే శాసిస్తున్న వీరిని కంట్రోల్ చేసి ప్రైవేటు యాజమాన్యాలు ప్రభుత్వ నియమాలకనుగుణంగా నడిపించ ప్రయత్నించటం అంత సులువైంది కాదు. అయినా 1994లో ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ఎంఎస్ నెం.1 ప్రకారం వాటిని నియంత్రించటానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి.

**స్కూలు పరిపాలనా కమిటీలు :-** జిఒ ఎంఎస్ నెం.1 లోని రూల్ నెం 16 ప్రకారం ప్రెసిడెంట్, సెక్రటరీ, హెడ్‌మాస్టర్, - విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధి, విద్యార్థులలో చదువుకున్న తల్లి, ఒకరు ఉపాధ్యాయుల ప్రతినిధి, మొత్తం ఆరుగురితో ప్రతి స్కూలులో పరిపాలనా కమిటీ వేయాలి. ఇది సంవత్సరానికి మూడుసార్లు సమావేశం కావాలి.

టీచర్ల జీతాల పెంపుదల, పిల్లల ఫీజుల పెంపుదల, స్కూలు నిర్వహణకు సంబంధించిన సూచనలు, సలహాలు ఈ కమిటీ నిర్ణయిస్తుంది.

ప్రైవేటు విద్యాలయాల నిర్వహణలో తల్లిదండ్రుల పాత్ర పెరగాలి. ఫీజులు నియంత్రణలో ఉంచడం, విద్యాప్రమాణాలు కాపాడుకోవడానికి కృషి చేయాలి. కమిటీలు




ఏర్పడాలి. వాటిని అమలు చేయించాలి. పాఠశాల, హాస్టలులో మంచి సౌకర్యాలు ఉండేలా కృషి చేయాలి.

– ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్స్ కూడా అమలు కావడం లేదు. పేదలు కూడా ఫీజుల భారం భరించాల్సి వస్తుంది.

– విద్యాహక్కు చట్టం ప్రకారం 25%మంది పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇవ్వాలి.

–సోషల్ రెస్పాన్సిబిలిటీగా ప్రైవేట్ స్కూల్స్ పేద పిల్లలను చేర్చుకోవాలని సుప్రీం కోర్టు చెప్పింది. ఇవేమి అమలు కావడం లేదు. అమలు చేయించాలి.

* * *

# ఉన్నత విద్య

**నేతి బీరకాయలో నెయ్యి ఎంత వుంటుందో ఈ రంగంలో అభివృద్ధి అంత కన్పిస్తున్నది!**

**ఉ**న్నత విద్యారంగం సంక్షోభంలో వుంది. భారతదేశం మొత్తం మీద మరియు ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇదే పరిస్థితి నెలకొని వుంది. ఉన్నత విద్య, విద్యార్థుల యొక్క సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడాలి. విద్యార్థుల యొక్క ఆలోచనలను పదునుపెట్టి నూతన పుంతలు త్రొక్కించాలి. విశాల అవగాహనను, ప్రశ్నించే తత్వాన్ని, సమాజం గురించి ఆలోచించే స్వభావాన్ని పెంపొందించాలి. కాని ఉన్నత విద్య ఆ లక్ష్యానికి దూరంగా వుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వేయబడిన అనేక కమిటీలు ఉన్నత విద్యలో ప్రభుత్వ జోక్యం, పెట్టుబడి పెరగాలని తెలిపాయి. యన్.డి.ఎ ప్రభుత్వం 2000సం॥లో వేసిన బిర్లా-అంబాని కమిటి, యు.పి.ఎ. వేసిన శ్యామ్‌పెట్రాడా కమిటీలు విద్యను ప్రైవేటీకరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆ సూచనలను పాటించి ప్రైవేటుకు ఊతం అందించాయి. రాష్ట్ర ప్రభుత్వాల పరిస్థితి మరింత అన్యాయంగా వుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ, యూనివర్శిటి విద్య ఎలా వుందో పరిశీలిద్దాం.

**ఇంటర్మీడియట్:** ఇంటర్మీడియట్ విద్యను అందించే కళాశాలలు మన రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో 439, ఎయిడెడ్ - 131, ప్రైవేటులో 1550 పైగా ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో సుమారు 1000 మంది రెగ్యులర్ అధ్యాపకులు 4400 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. 800 వరకు అధ్యాపక పోస్టులు ఖాళీగా వున్నాయి. 131 ఎయిడెడ్ కళాశాలల్లో దగ్గర దగ్గర 1000 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీటిలో గత 10-15 సం॥రాలలో ఏ విధమైన నియామకాలు జరగలేదు. ఉన్న అధ్యాపకులను పిల్లల సంఖ్య ఆధారంగా రి-డిప్లోయిమెంట్ ద్వారా ఇతర కళాశాలలకు పంపించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలకు ప్రధాన పోటీ కార్పోరేట్ విద్యాసంస్థల నుంచి మరియు ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి ఎదురవుతుంది. **ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలని**

**బలోపేతం చేయకపోగా Eamcetకు విద్యార్థులను తయారుచేసే నైపుణ్యాలను ప్రభుత్వ అధ్యాపకులకు అందించడం లేదు.** ప్రైవేటు కళాశాలల మీద ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వలన, సరిఅయిన సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమగ్రమైన విద్య అందించడం ద్వారా సమతుల్య సమాజాన్ని తయారుచేయాల్సిన పాలకులు, చరిత్ర, రాజనీతిశాస్త్రం, సోషియాలజి తదితర సామాజిక శాస్త్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇంటర్మీడియట్ విద్యను కేవలం ఇంజనీరింగ్, వైద్య, విద్యకు ముడిసరుకుగా మార్చివేశారు. ఆదుష్ఫలితాలను మనం చూడడం మొదలైంది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, ఒక ప్రణాళికాబద్ధమైన +2 విద్యను అందించాలని ఆశిద్దాం! దానికై ప్రజలను చైతన్యవంతులను చేసి పోరాటం చేద్దాం.

చాలా కీలకమైన ఈ స్టేజిలో మెజార్టీ విద్యార్థులు కార్పొరేట్ కాలేజీలలో చేరుతున్నారు. ఇక్కడ చేరకపోతే విద్యార్థి జీవితం వృధా అవుతుందనేది ప్రచారం జరుగు తున్నది. చదువును భట్టీపట్టిస్తున్నారు. సృజనాత్మకతను నాశనం చేస్తున్నారు. ర్యాంకులు రాగలిగినా 5% మినహా మిగిలిన వాళ్లకు ఆ తరహా చదువు నష్టం కలిగిస్తున్నది.

**విశ్వవిద్యాలయాలు మరియు డిగ్రీ కళాశాలలు:** ఆంధ్రప్రదేశ్‌లో నేడు 20 విశ్వ విద్యాలయాలు, 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 126 ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు, 1062 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. సుమారు 3 లక్షల మంది అన్ని రకాల కోర్సులు చదివి గ్రాడ్యుయేట్స్‌గా బయటికి వస్తున్నారు. యూనివర్శిటీ మరియు డిగ్రీ విద్య సమాజానికి మంచి పౌరులను, దేశానికి మేధావులను అందించాలి. ఆయా ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను అర్థంచేసుకొని విద్యార్థులకు తగిన విద్యను అందించాలి. సెనేట్ మరియు సిండికేట్‌లలో తమ విద్యాలయ పరిధిలోని సామాజిక, ఆర్థిక, సాంఘిక అంశాలను వెనుకబాటుతనాన్ని చర్చించి వాటిలోని లోటుపాట్లను ప్రజలకు మరియు ప్రభుత్వానికి తెలపాలి. కాని నేడు విశ్వవిద్యాలయాలలో మరియు డిగ్రీ కళాశాలలో పరిశోధన  పూర్తిగా కొరవడింది. నూతన విషయాలను కనుక్కోవడం, ప్రయోగాలు చేయడం దాదాపుగా కనుమరుగయ్యింది. ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గిపోవడం, అధ్యాపకులను నియమించక పోవడం వలన ఇలా జరుగుతుంది. 20 విశ్వవిద్యాలయాలలో మొత్తం 1339 అధ్యాపకులు మాత్రమే పనిచేస్తున్నారు.  దాదాపు 2000 టీచింగ్ పోస్టులు విశ్వవిద్యాలయాలలో ఖాళీగా వున్నాయి. 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 1700 మంది రెగ్యులర్ 705 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తుండగా




సుమారు 600 అధ్యాపకులు పోస్టులు ఖాళీగా వున్నాయి. దీనితో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు బోధించే గెస్టుఫ్యాకల్టీ 1000 మంది వున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు ప్రభుత్వం పోస్టులు మంజూరు చేయడంలేదు. ఇక ఎంతోమందికి విద్యను అందించిన ఎయిడెడ్ కళాశాలలు 126 వున్నాయి. వాటి పరిస్థితి దయనీయంగా వుంది. ఒకప్పుడు విద్యాకేంద్రాలుగా బాసిల్లిన సంస్థలు నేడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఈ కళాశాలలో నేడు కేవలం 1700 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. 2500 వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత 10–15 సం॥రాలుగా నియామకాలు లేకపోవడం పెద్ద ప్రమాదంగా పరిణమించింది. సింహభాగం విద్యార్థులు ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులకు వెళ్ళిపోగా మిగిలిపోయిన పేద, అట్టడుగు విద్యార్థులు డిగ్రీ కోర్సులకు మరియు విశ్వవిద్యాలయాలకు చేరుతున్నారు. వీరు గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌కు ప్రతినిధులుగా సామాజిక, ఆర్థిక అంశాలను అవగాహన చేసుకునే వారిగా కావాలంటే – వీరు విద్యను అభ్యసించే కళాశాలలు విశ్వవిద్యాలయాలు మెరుగ్గా ఉండాలి. వారు చదువుకునే కోర్సులు విజ్ఞానాన్ని, ఉపాధిని అందించేవిగా ఉండాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా అనేక మందికి విద్యను అందిస్తున్న

1062 ప్రైవేటు కళాశాలల్ని కూడా ప్రభుత్వం పర్యవేక్షించాలి. ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. కాని, ఆ కళాశాలల్లో మెరుగైన వసతులు, విద్యా బోధన జరిగేవిధంగా చర్యలు లేవు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయాలి.

సెనేట్, సిండికేట్, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిరంతరం జరగాలి. ప్రజాస్వామ్య వాతావరణం ఉండాలి. భవిష్యత్ సమాజానికి అవసరమైన నాయకులను అందించే ప్రక్రియను పాలకులు అర్థం చేసుకోవాలి.

### కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్‌సి, ఎస్‌టిలు-బిసీలు (%)

దేశ జనాభాలో అత్యధికంగా వున్న ఎస్సీ,ఎస్టీ, బిసీలకు ఉన్నత విద్యావకాశాలు అందకపోవడం, ఆచరణలో వారు పై స్థాయి ఉద్యోగాలను కూడా అందుకోలేని స్థితి దిగువ పట్టిక గమనిస్తే అర్థమవుతుంది. అత్యధిక జనాభాకు ఉన్నత విద్య దూరమయితే దేశం "నాలెడ్జ్ హబ్"గా ముందుకెళ్తుందా?

| | క్లాస్-1 | | క్లాస్ -2 | | క్లాస్-3+క్లాస్-4 | |
|---|---|---|---|---|---|---|
| | ఎస్సీ+ ఎస్టీ | బిసి | ఎస్సీ+ ఎస్టీ | బిసి | ఎస్సీ+ ఎస్టీ | బిసి |
| కేంద్ర మంత్రిత్వ శాఖలు | 7.18 | 2.59 | 13.66 | 3.98 | 30.95 | 8.41 |
| కేంద్రప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు | 6.64 | 5.09 | 18.74 | 11.74 | 20.78 | 20.98 |
| పబ్లిక్ సెక్టార్ సంస్థలు | 4.51 | 4.59 | 17.84 | 9.91 | 31.76 | 15.77 |
| మొత్తం | 5.68 | 4.69 | 18.18 | 10.63 | 24.40 | 18.98 |

* * *

# ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్య - కొన్ని పరిశీలనలు

ఆంధ్రప్రదేశ్‌లో 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, 14 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీలలో 1750 సీట్లు, ప్రైవేటు మెడికల్ కాలేజీలలో 2000 సీట్లు ఉన్నాయి. కానీ ఈ సీట్ల సంఖ్యలో, మెడికల్ కాలేజీల సంఖ్యలో యం.సి.ఐ. గుర్తింపుకు లోబడి కొన్ని మార్పులు రావచ్చు.

వైద్య విద్యలో ప్రమాణాలు కాపాడటానికి యం.సి.ఐ., ఎన్.టి.ఆర్. వైద్య విశ్వవిద్యాలయం ఉంది. ఇది కాక వైద్య విద్య పాలన నిర్వహించడానికి డైరెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఉంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి 1000 మందికి ఒక డాక్టరు అవసరమని చెబితే ప్రస్తుతం మనదేశంలో 1953 మందికి ఒక డాక్టరు ఉన్నాడు. అంటే జనాభా లెక్కను తీసుకుంటే మనదేశంలో ఇప్పుడున్న డాక్టర్ల సంఖ్యకు రెండింతలు కావాల్సి ఉంటుంది. 1000 మంది జనాభాకు చైనాలో 1.6 మంది డాక్టర్లు, ఇంగ్లండ్‌లో 5.4 మంది, అమెరికాలో 5.5 మంది, క్యూబాలో 5.9 మంది డాక్టర్లు ఉన్నారు. మనదేశంలో కనీసం 1000కి కనీసం ఒకరు నిష్పత్తిని 2028కి సాధించాలన్నా వైద్య విద్యపై ఎంతో శ్రద్ధ, పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2022కు 4,17,199మంది అలోపతి డాక్టర్లు, 2,09,091 మంది స్పెషలిస్టులు, 64523 ఆయుష్ డాక్టర్లు అవసరమవుతారని ఒక అంచనా. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఐ.ఎం.ఏలో ఉన్న డాక్టర్ల సంఖ్య 2లక్షలకు పైగా ఉంది. ఒక విధంగా చూస్తే ఇప్పుడున్న డాక్టర్ల సంఖ్యకు రెట్టింపు డాక్టర్లు ఒక ఏడు సంవత్సరాలలో అవసరమవుతారు.

ప్రజలందరికీ వైద్యం అందాలంటే ఒక యూనివర్సల్ హెల్త్‌కేర్ మోడల్‌ను డాక్టర్

శ్రీనాథ్‌రెడ్డి నాయకత్వాన హైలెవెల్ ఎక్స్‌పర్ట్‌గ్రూపు ప్రతిపాదించింది. ఆ స్ఫూర్తితో చూస్తే...

1. ప్రతి 10లక్షల మందికి ఒక మెడికల్ కాలేజీ అవసరమవుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 20లక్షల మందికి ఒక కాలేజీ ఉంది. అంటే మరో 20-30 కాలేజీల అవసరం ఉంది. అయితే దీన్ని ప్రైవేటు రంగంలో కాకుండా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రులను వైద్యశాలలుగా మార్చాలి.
2. ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఫీజులను, అవినీతిని నియంత్రించడానికి తగిన చర్యలను తీసుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులకు మించి వసూలు చేసే వైద్య కళాశాలలపై భారీగా జరిమానాలు విధించాలి.
3. వైద్య విద్యలో ప్రివెంటీవ్, ప్రమోటీవ్, రిహబిలిటేటివ్ ఆరోగ్య సేవలకు మరింత ప్రాధాన్యత అవసరం.
4. వైద్య విద్య పూర్తయిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ఉన్నత విద్యలో మంచి వెయిటేజీ కల్పించాలి.
5. పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం ఉన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్‌ను మరింత బలోపేతం చేయాలి.
6. ప్రతి మెడికల్ కాలేజీలో క్లినికల్ స్కిల్ ఉండాలి.
7. ప్రతి మెడికల్ కాలేజీలో ఉన్న లైబ్రరీలను మరింత బలోపేతం చేసేందుకై నాలెడ్జ్ సెంటర్లు / డిజిటల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి.
8. ప్రభుత్వ వైద్యకళాశాలలో యం.సి.ఐ. ఇన్‌స్పెక్షన్స్‌లో బయటపడే అవసరాలను తీర్చడానికి ఒక శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలి.
9. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో సూపర్‌స్పెషాలిటి యూనిట్లను పెంచాలి. తగినట్టుగా సూపర్‌స్పెషాలిటి సీట్లను పెంచాలి.
10. ప్రతి మెడికల్ కాలేజీలో ట్రామాకేర్ యూనిట్లు / ఎమర్జెన్సీ మెడిసన్ యూనిట్లు ప్రారంభించాలి.
11. మెడికల్ కాలేజీలో జరగాల్సిన రీసెర్చ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలి.
12. హెల్త్ యూనివర్సిటీని బలోపేతం చేయాలి. ఇప్పుడు పరీక్షలు నిర్వహించడానికి మాత్రం పరిమితమవుతున్నది. అవసరమైతే మెడికల్ కాలేజీల్లో విద్యా ప్రమాణాలను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేకమైన మానిటరింగ్ వ్యవస్థను

**యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలి.**

**13. యం.సి.ఐ. నామ్స్ రెక్టిఫికేషన్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి.**

**14. మెడికల్ కాలేజీలలో మరీ ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీలలో ఫ్యాకల్టీ కొరత ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం ఏళ్ల తరబడి వేకెంట్ (ఖాళీ) పోస్టులను భర్తీ చేయకపోవడం. వెంటనే మెడికల్ కాలేజీలలో ఉంటున్న అన్ని వేకెన్సీలను - టీచింగ్, నాన్‌టీచింగ్ - భర్తీ చేయాలి.**

**15. మెడికల్ టీచింగ్ ఫ్యాకల్టీకి యు.జి.సి. నిబంధనల మేరకు జీతాలు ఇవ్వాలి. అలాగే కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌ను ప్రతి సంవత్సరం అమలు చేయాలి. నాన్ ప్రాక్టీసింగ్ అలవెన్స్‌ను ఇవ్వాలి.**

**16. వెంటనే ప్రొఫెసర్ - అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి.**

**17. పి.జి. వైద్య విద్యార్థులకు అవసరమైన అలవెన్సులను ఎప్పటికప్పుడు పెంచాలి. వారికి క్వార్టర్స్ తదితర సౌకర్యాలను కల్పించాలి.**

**18. ప్రైవేటు మెడికల్ కాలేజీలలో ప్రమాణాల ప్రకారం నడవకపోతే ప్రభుత్వమే వాటిని స్వాధీనం చేసుకొని నిర్వహించాలి.**

**19. ప్రతి సంవత్సరం దాదాపు 10వేల మందికిపైగా వైద్య విద్యను ఇతర దేశాలలో చదువుకొని వస్తున్నారు. వీరి సేవలను ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.**

**20. అలోపతితోపాటు ఆయుర్వేదిక్, హోమియో, యునాని విభాగాలను కూడ అభివృద్ధి పరచాలి.**

**ఇంజనీరింగ్ విద్య :** ఇంజనీరింగ్ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం ప్రారంభమైన తరువాత ప్రైవేటు కాలేజీల సంఖ్య విపరీతంగా పెరిగింది. మనరాష్ట్రంలో 13 ప్రభుత్వ, 398 ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు నడుస్తున్నాయి. ఉద్యోగ ఆశతో ఈ కాలేజీల్లో చేరుతున్నారు. కానీ యజమాన్యాలు పిల్లల శక్తి సామర్థ్యాలు పెంచడానికి చేస్తున్న కృషి లేదు. నైపుణ్యం గలిగిన అధ్యాపకులను నియమించడం లేదు. ఆధునాతనమైన ల్యాబ్‌లు నిర్మించడంలేదు. పరిశోధన అంతకన్నా లేదు. పరీక్షా పద్ధతులు కూడా సరిగా లేవు. ప్రభుత్వంవైపునుండి పర్యవేక్షణ అసలే లేదు.

10% పిల్లలకు మాత్రమే మంచి ఉద్యోగాలు వస్తున్నాయి. గతంలోలాగా ఉ

ద్యోగాలు రావటం లేదు. బ్యాంకు ఉద్యోగాలకు, అవసరం అయితే ఏదైనా పనిచేయడానికి వీరు సిద్ధమవుతున్నారు.

గతంలో ఇంజనీరింగ్ మంచి ఉద్యోగానికి రహదారి. నేడు నిరుద్యోగానికి నిట్టూర్పులావుంది. ఇక్కడ పెరుగుతున్న నిరుద్యోగం ఒక సామాజిక సమస్యగా మారే పరిస్థితి వుంది. వీరికి స్కిల్స్ పెంచి, ఇంటర్వ్యూలకు సన్నద్ధం చేయాలి.

**పాలిటెక్నిక్ కళాశాలలు :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలలు 74, ప్రైవేట్ కళాశాలలు 203 ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో కొన్ని కళాశాలలు రెండు షిఫ్ట్‌లో పని చేస్తున్నాయి. అంటే కళాశాల, వసతులు, అధ్యాపకులు రెండు షిఫ్టుకు ఒక్కరే, కాని పిల్లలు మాత్రం వేరుగా ఉంటారు. సమాజానికి అత్యంత సృజనాత్మకతను, పరిశోధనను, నూతన ఆవిష్కరణను అందించి ముందుకు నడపవలసిన ఇంజనీరింగ్ డిప్లమా కోర్సు ఆ దిశగా సాగడం లేదు. వనరుల, వసతుల కొరత, లాబరేటరీ ఆధునీకరణ కొరవడింది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎస్‌డిసి) ద్వారా విద్యార్థులకు కొంతమేర ఉపాధి సంబంధిత శిక్షణ యిస్తున్నప్పటికి, పరిస్థితి ఇంకా మెరుగుపడాలి. ప్రభుత్వ కళాశాలల్లో సుమారు 500 ఖాళీలు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల మీద సరైన పర్యవేక్షణ కొరవడింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ప్రభుత్వం లక్షల రూపాయలు ప్రైవేట్ కళాశాలలకు యిస్తున్నప్పటికి వసతులలేమి కనిపిస్తుంది. ప్రైవేట్ కళాశాలల మీద పర్యవేక్షణ పెంచి అక్కడ చదువుతున్న విద్యార్థులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరచి, ప్రభుత్వ కళాశాలలలో అధ్యాపకుల ఖాళీలను నింపడానికి, ల్యాబరేటరీ సౌకర్యాలను మెరుగు పరచడానికి, పరిశోధనను ప్రోత్సహించడానికి కృషి చేయాలి.

* * *

# ఐ.టి.ఐ

పారిశ్రామిక శిక్షణా సంస్థలన్నీ (ఐటిఐలు) యువతకు పారిశ్రామిక శిక్షణనందించి ఉపాధి అందించేందుకు అనుగుణంగా 1950 ల్లోనే రూపొందించబడ్డాయి. ఆర్థిక, సామాజిక వెనుకబాటు ఉన్న పేద, మధ్య తరగతి మరియు గ్రామీణ ప్రాంతాల యువత ఇందులో శిక్షణ పొంది ఏదో ఒక ఉపాధి సాధించే లక్ష్యంతో ఐటిఐలలో చేరుతున్నారు.

1960, 70 దశకాలలో ప్రభుత్వరంగ సంస్థలు భారతదేశంలో స్థాపించబడినప్పుడు ఐటిఐ పూర్తిచేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు లభించాయి. అయితే ప్రభుత్వ పారిశ్రామిక, ఆర్థిక విధానాల వలన క్రమంగా ఐటిఐల్లో చదువుకునే వాళ్ళకు కొత్త పరిశ్రమలు రానందున ఉపాధి తగ్గి క్రమంగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. స్కిల్ ఫోర్సు రాశిలోనూ వాసిలోనూ కూడా తగ్గుదల కనిపించడంతో సిఐఐ, ఎఫ్ఐసిసిఐ లాంటి కార్పోరేట్ సంఘాల వత్తిడి మేరకు ప్రభుత్వాలు స్కిల్ డవలప్‌మెంట్ వైపు దృష్టి సారించాయి.

ఆ క్రమంలో రాష్ట్రంలోని సమారు 72 ప్రభుత్వ ఐటిఐల్లో వివిధ స్కీమ్స్ ద్వారా అంటే విటిఐపి, పిపిపి, ఎంఈఎస్‌ల ద్వారా ఐటిఐల్లోని వసతులు మెరుగు పర్చేదానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. విటిఐపి స్కీమ్‌లో 3.5 కోట్లు వ్యయం చేస్తూ 17 ఐటిఐలని ఆధునీకరించారు. పిపిపి స్కీమ్‌లో 2.5 కోట్లలో 30 ఐటిఐల్లో కొత్త ట్రేడ్స్‌ని, యంత్ర పరికరాల్ని అభివృద్ధి చేస్తున్నారు.

సుమారు 32 ఇంజనీరింగ్ మరియు నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లో 60,000 సీట్లు వున్నాయి.

కేంద్ర ప్రభుత్వం 12000 కోట్లతో నేషనల్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను స్థాపించి స్కిల్ డవలప్‌మెంట్ పేరుతో ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు శిక్షణ నిమిత్తం కోట్లాది రూపాయలు ధారాదత్తం చేస్తున్నారు. నిజమైన స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్స్

(ఐటిఐ) లకు మొక్కుబడిగా నిధులు విదుల్చుతున్నందువల్ల ఇంకా ఐటిఐలు అనేక సమస్యల్తో విలవిలలాడుతున్నాయి.

1. **బోధకుల కొరత :-** సుశిక్షితులైన బోధకులు ఉంటేనే శిక్షణలో మెరుగైన ప్రమాణాలు సాధ్యం. మన రాష్ట్రంలోని ఐటిఐల్లో సుమారు 60% బోధకులు లేరు. కొత్త ట్రేడ్స్ పెట్టినా మంజూరు కాలేదు. ఉన్న కొన్ని ఖాళీల్లో కాంట్రాక్టు పద్ధతిలో బోధకుల్ని వేసినా అంత ప్రయోజనకరంగా ప్రమాణాల మెరుగుకాలేదు.
2. **కొత్త సాంకేతిక పరిజ్ఞానం-యంత్రపరికరాలు :-** మారుతున్న సాంకేతిక అవసరాలకు ధీటుగా ప్రమాణాలు మెరుగు పర్చుకోవాలంటే కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టాలి. కొత్త యంత్ర పరికరాలు కొనుగోలు చేయాలి. అవి నడిచేదానికి తగ్గట్టుగా విద్యుత్తు ఛార్జీలు వుండాలి. ప్రాక్టికల్ మెటీరియల్స్ సరిపడా లేవు.
3. **బోధకులకు పరిశ్రమల్లో తర్ఫీదు :-** మారుతున్న అవసరాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు బోధకులకు తర్ఫీదు ఇవ్వాలి. పరిశ్రమల్లో బోధకులకు తర్ఫీదు ఇస్తేతప్ప సరైన ప్రమాణాలు మెరుగుపడవు. ఆ దిశలో చర్యలు లేవు.
4. **అశాస్త్రీయ పరీక్షా విధానాలు :-** ఐటిఐ పూర్తిగా ప్రాక్టికల్ ఓరియంటెడ్. వీరిని పట్టుకొని ఎకడమిషియన్స్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించటం సరికాదు.
5. **భవనాల కొరత :-** రాష్ట్రంలో కొత్తగా 42 ఐటిఐలు పెట్టారు. ఒక్కదానికి సొంత భవనాలు లేవు. సరిపడా యంత్ర పరికరాలు లేవు. అవన్నీ కూడా కేంద్రప్రభుత్వ గుర్తింపుకు నోచుకోలేదు.
6. **ఫర్నీచర్ కొరత :-** అన్ని ప్రభుత్వ ఐటిఐల్లో కూడా విద్యార్థులు కూర్చోవటానికి ఫర్నీచర్ సౌకర్యంలేదు.
7. **గ్రంథాలయాల కొరత :-** ఏ ఐటిఐలో కూడా పూర్తిస్థాయి గ్రంథాలయాలు లేవు. గ్రంథాలయాలు నిర్వహించే సిబ్బంది కూడా లేరు. పాలిటెక్నిక్ విద్యపైన కూడా అధ్యయనం చేయాలి.

మోడీగారి 'మేక్ ఇన్ ఇండియా' కలగాని, 2029 నాటికి దేశంలో మూడవ స్థానం, 2050 నాటికి ప్రపంచంలో రాష్ట్రం మొదటి స్థానానికి రావాలనే చంద్రబాబుగారి రంగులకల నిజంకావాలంటే అన్నింటికన్నా ముందు సిద్ధంకావాల్సింది విద్యారంగం.

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కినట్లు కేంద్రం నిధులతో హైస్కూలులో పనిచేస్తున్న కంప్యూటర్ టీచర్స్‌ని ఇంటికి పంపించి 2 సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకున్న నాధుడు లేడు. ప్రతి స్కూలుకు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తానన్న చంద్రబాబుగారు తన విద్యా మిషన్‌లో భాగంగా చెప్పారు. (ఒక్క స్కూలుకి దాదాపు 5 లక్షలవుతుంది) రాష్ట్రంలో ఉన్నత విద్యకు కేటాయింపు 0.42%గా వుంది. మొత్తం విద్యారంగం భవిష్యత్తు ప్రయివేటు రంగంపైనే ఆధారపడేటట్లుగా చేయాలనే వారికి ఈ అవసరాలు కనపడతాయా?

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం అన్నిరకాల గ్రాడ్యుయేట్స్ మూడు లక్షలమంది తయారవుతున్నారు. ఇప్పటికీ 20లక్షలమంది ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. వీరందరు జాతీయ, అంతర్జాతీయ పోటీలను సమర్థంగా ఎదుర్కోవటానికి అవసరమైన సామర్థ్యాన్ని పెంచడానికి శిక్షణ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత.



**చిన్న తరగతులలో సరైన వసతులు లేక ఎక్కువ మంది విద్యార్థులు మెడికల్, ఐఐటి వంటి ఉన్నత చదువులకు అర్హత సాధించ లేకపోతున్నారు**

# ముగింపు

మనవిద్యారంగంలోని అన్ని వ్యవస్థలూ ఇంత ఘోరంగా వున్నా సమాజ మంతా డొల్లపోయిందనేమీ చెప్పలేము. ప్రజల్లో విద్యపట్ల పెరుగుతున్న అసాధారణ తృష్ణ ఓ గొప్ప అవకాశం. ఈ తృష్ణనుంచే అసంతృప్తీ, ఆగ్రహం కూడా పెల్లుబుకు తున్నాయి. మనం కుమ్మరిస్తున్న సొమ్ము మన పిల్లలకి నిజంగా ఏమిస్తోందనే చర్చ మధ్య తరగతిలో మొదలైంది. అంతా దగా అనే వాస్తవం క్రమక్రమంగా ముందు కొస్తోంది.

దీనికి తోడు ఆంధ్రప్రదేశ్‌కి గొప్ప వారసత్వం వుంది. డేవిడ్ హాస్బిరో, జిడ్డు కృష్ణమూర్తి లాంటి స్వేచ్ఛా విద్యా ప్రవక్తలు అద్భుతమైన విద్యాతత్వాన్ని, దాన్ని ఆచరణలో చూసే విద్యా సంస్థల్ని మన రాష్ట్రంలోనే నెలకొల్పి ప్రపంచ వ్యాప్తం చేశారు. వీరి శిష్య గణం వందలాదిమంది వున్నారు. తమకు తోచిన పద్ధతిలో ఆధునిక ప్రజాస్వామిక విద్య కోసం వీరు కృషి చేస్తున్నారు. వీరిలో కొందరు విద్యాలయాల్ని నడుపుతుంటే కొందరు వాటికి చేదోడువాదోడుగా వుంటున్నారు. శివరాంలాంటి వారైతే జీవితాన్నే పిల్లలకి అంకితం చేశారు. వారి ఆత్మీయ శిష్యగణం లెక్కలేనంతమంది వున్నారు. కొందరు మంచి సమాజం మంచి విద్యతోనే సాధ్యమని నమ్మి చేతులు కాలుతున్నా లెక్కచెయ్యకుండా విద్యా సంస్థలు నడుపుతున్న వారున్నారు. వీరు ఏటికి ఎదురీదుతున్నారు.

మాతృభాష కోసం పరితపిస్తూ కార్పొరేట్ విద్య తెలుగును ధ్వంసం చేస్తోందని నమ్మి పాఠశాలల్లో గ్రంథాలయాలు నడుపుతున్న వారున్నారు. వీరికి పిల్లల భాషా సామర్థ్యాల పట్ల అపారమైన ఆవేదన వుంది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు బాలకార్మికుల కోసం, అనాథల కోసం పాఠశాలల్ని నడుపుతున్నాయి. నిరుపేదల చదువులు ఎలా వుండాలో వారికి చాలామందికంటే ఎక్కువ తెలుసు. అట్టడుగున మన పిల్లల స్థితి

గతులు ఎంత దయనీయంగా వున్నాయో వారు చెప్పగలరు. విద్యా తాత్వికులకూ మనలో ఏం కొదవలేదు. శిశు వికాసంపైనా, పాఠశాలల్లోని అప్రజాస్వామిక పద్ధతుల పైనా, ఏ సమాజాన్ని ఏ విద్య నిర్మిస్తుందనే దానిపైనా వీరు ఎంతో పరిశోధన చేశారు. పలు గ్రంథాలు రాశారు. విద్యను ప్రజాస్వామ్యీకరించేందుకు, ప్రపంచ బ్యాంకు నిర్దేశాలను, సరళీకరణ విధానాలను విద్యారంగంలో నిరోధించేందుకు సమరశీలంగా ప్రయత్నిస్తున్న వారూ మనలో వున్నారు. వీలున్నంత విశాల ప్రాతిపదికన ఉద్యమాల్ని నిర్మించే ప్రయత్నం చేస్తూనే స్పష్టమైన రాజకీయ వైఖరితో వీరు పనిచేస్తున్నారు.

సామాజికార్థిక శాస్త్రవేత్తలూ విద్యారంగంపై ఈ మధ్య విపరీతంగా చర్చిస్తున్నారు. విద్యను సామాజిక పెట్టుబడిగా, పునాదిగా వారు నిర్వచిస్తున్నారు. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాల నుంచి ఇటీవల ముందుకొచ్చిన ఆసియా పులుల దాకా ప్రభుత్వ రంగంలో విద్యను ఎంత పదిలంగా నిలబెట్టుకొన్నాయో, పేదలందరికీ ఎంత అద్భుత మైన విద్యనందిస్తున్నాయో వారు తులనాత్మకంగా చెబుతున్నారు. విద్య, ఆరోగ్యం ఇవి రెండూ లేని సమాజపు అభివృద్ధిని 'అనిశ్చితకీర్తి'గా అమర్త్యసేన్ విశ్లేషిస్తాడు. అలాగే విద్యను సామాజిక అసమానతల తొలగింపుకొక ప్రధాన సాధనంగా భావించే దళిత బహుజన ఉద్యమాలకూ లోటు లేదు.

ఇప్పుడు వీరంతా చేతులు చేతులు కలపాల్సివుంది. ఒక మహోన్నత మానవీయ సమాజ నిర్మాణంలో విద్యకున్న పాత్ర అత్యంత విలువైనదని నమ్మే వారందరూ ఏకం కావల్సి వుంది. ఎక్కడికక్కడ అట్టడుగు గ్రామసీమలు – పట్టణాల నుంచి జోక్యం చేసుకోవాల్సి వుంది. ప్రజల్ని సంఘటితం చేయాల్సి వుంది. కార్పొరేట్ వ్యాపార దాహాన్ని నిలువరించాల్సివుంది. ప్రభుత్వాన్ని నిలదీయాల్సి వుంది.

ఓపిగ్గా పనిచేస్తే ఇది సాధ్యం. సమాజం దీనికి సన్నద్ధమవుతున్న దశలో మనమున్నామన్పిస్తోంది. ఎవరు ఏ రూపంలో పాల్గొన్నా స్వాగతిద్దాం. మన యాత్ర సుదీర్ఘం కావచ్చు. అయినా సిద్ధపడదాం. కలిసి రమ్మని సిపియం విజ్ఞప్తి చేస్తున్నది.

* * *

# ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని రూపొందించాలి

- ప్రాధమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20, ప్రాధమికోన్నతపాఠశాలల్లో 1:25, ఉన్నత పాఠశాలల్లో 1:30,సీనియర్ సెకండరీ పాఠశాలల్లో 1:35గా ఉండాలి.
- ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ననుసరించి ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి.
- ప్రతి బిడ్డకు 18 సంవత్సరాల వయస్సు వరకు ఉచిత నిర్బంధ మరియు నాణ్యమైన విద్య
- ప్రభుత్వం విద్యార్థులకు 9వ తరగతినుండే ఒకేషనల్ విద్యను అందించాలి.
- సిసిఇ విద్యావిధానాన్ని 10వ తరగతి వరకు కొనసాగించాలి.
- పబ్లిక్ పరీక్షా విధానాన్ని 10వ మరియు 12వ తరగతి వరకూ కొనసాగించాలి.
- సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టాలి.
- మహిళలు, ఎస్.సి, ఎస్.టి మరియు మైనారిటీలలో గ్రామీణ అక్షరాస్యతను పెంపొందించడానికి అడల్ట్ ఎడ్యుకేషన్ మరియు నేషనల్ ఓపెన్ స్కూలింగ్ విధానాన్ని పెంపొందించాలి.
- మానవీయ విలువలు, సామాజిక అంశాలు, సమాజశాస్త్రం విషయాలను బోధించడానికి ప్రాముఖ్యత – పాఠశాల ప్రమాణాలు, పని విధానం మరియు మేనేజ్‌మెంట్ వ్యవస్థలు అభివృద్ధి చేయాలి
- పాఠశాల అభివృద్ధికి మరింత ఎక్కువగా బడ్జెట్ మంజూరు చెయ్యాలి.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మరియు, గర్ల్ చైల్డ్, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులకు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ ప్రారంభించాలి.
- ప్రాథమిక తరగతుల వరకు బోధన మాతృభాషలోనే అందించాలి.
- ప్రాథమిక తరగతులలో రెండు భాషల ఫార్ములా అంటే మాతృభాష మరియు ఇంగ్లీషు సబ్జెక్టుగా బోధించాలి.
- సంపూర్ణ విద్యనందించే దిశగా. విలువలు, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆర్ట్స్, క్రాఫ్ట్, జీవన నైపుణ్యాలు పెంపొందించాలి.
- ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ & గైడ్స్ రెడ్‌క్రాస్, స్టూడెంట్ పోలీస్ వంటి వాటిని ఉపయోగించుకోవాలి.
- క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్ష నిర్వహించాలి.

**వెల రూ. 3/-**

**సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, 27-13-3, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట విజయవాడ - 2**
**ఫోన్ నెం. 0866 - 2577202, ప్రచురణ కర్త: పి.మధు, రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎం) పార్టీ, ఆంధ్రప్రదేశ్**